సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శనివారం । 15 । ఫిబ్రవరి । 2025

గరిష్టం/కనిష్టం
34.0^0 / 17.1^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు కాస్త ఉక్కబోతగా ఉంటుంది. రాత్రివేళ చలితీవ్రత ఉంటుంది.

సమ్మక్క గద్దె వద్ద భక్తుల రద్దీ



'జంపన్న'లో స్నానం..
అమ్మవార్ల దర్శనం



మినీ మేడారం జాతర మూడో రోజు శుక్ర వారం భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులు జంపన్నవాగులో జల్లుస్నానాలు ఆచరించి గద్దెల వద్దకు చేరుకున్నారు. సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.
- ఎస్ఎస్ తాడ్వాయి - వివరాలు 8లో▸

జంపన్నవాగులో జల్లుస్నానం చేస్తున్న భక్తులు

న్యూస్‌రీల్

ఇసుక క్వారీల తనిఖీ
- స్టాక్‌యార్డ్‌లను పరిశీలించిన ఇంటెలిజెన్స్ ఎస్పీ బృందం



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పరిధి ఇసుక క్వారీల్లో ఇంటెలిజెన్స్ ఎస్పీ భాస్కర్ బృందం తనిఖీలు చేపట్టింది. ఇసుక క్వారీల్లో అక్రమాలను తావులేదని తనిఖీలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో ఇటీవల సమీక్ష చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇంటెలిజెన్స్ అధికారులు మహదేవపూర్ మండలం బొమ్మాపూర్, ఎలికేశ్వరం, మద్దులపల్లి, పలుగుల, కుంట్లం, పూసుకుపల్లి గ్రామాల్లో తనిఖీలు చేశారు. అక్కడ ఇసుక స్టాక్‌యార్డ్‌లను పరిశీలించి, టీజీఎండీసీ సిబ్బంది క్షుణ్ణంగా చర్చించారు. లోడింగ్ ఎంత మేర చేస్తున్నారు, ఎంత వరకు విక్రయాలు జరిగాయనే విషయాలను అక్కడి సిబ్బందితో తెలుసుకున్నారు. లారీలో ఇసుక ఎంత మేర తీసుకువెళుతున్నారని లారీ డ్రైవర్లను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం లోడింగ్ జరుగుతుందా లేదా అనే విషయంపై ఇంటెలిజెన్స్ అధికారులు పూర్తిస్థాయిలో ఆరా తీశారు. అనంతరం వేబ్రిడ్జి కాంటాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం తరపున ఉన్నవి ఎన్ని, ప్రైవేట్‌గా ఏర్పాటు చేసిన వేబ్రిడ్జిలను తనిఖీ చేశారు. రికార్డులు, వేబిల్లులను పరిశీలించారు. సమగ్ర నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిసింది. ఆయనతోపాటు ఇంటెలిజెన్స్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐ జితేందర్, సిబ్బంది ఉన్నారు.

డాక్టర్లను నియమించాలి



భూపాలపల్లి రూరల్: చిట్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో వెంటనే డాక్టర్లను నియమించాలని ఎమ్మార్పీఎస్ (టీఎస్)జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య మాదిగ అధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతి పత్రం ఇచ్చారు. గతంలో 18మంది వైద్యులు చికిత్స అందించేవారని.. ప్రస్తుతం ఆరుగురు మాత్రమే ఉన్నారన్నారు. గర్భిణులు హనుమకొండ, పరకాల, భూపాలపల్లి వెళుతూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు శాస్త్రాల తిరుపతి మాదిగ, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ శీలపాక హరీశ్ మాదిగ, రాజబాబు మాదిగ పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

కాటారం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను వేధింపులకు గురిచేసిన కేసులో నాగరాజు అనే యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బాలికను నాగరాజు కొన్ని రోజులుగా వేధింపులకు గురిచేయడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని భయభ్రాంతులకు గురిచేశాడు. బాలిక వేధింపులు తట్టుకోలేక తల్లిదండ్రులకు తెలపడంతో.. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగరాజుపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు



చిట్యాల: సమాచార హక్కు చట్టం ఆక్టివిస్ట్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన చిగురు నాగరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల గణేష్ నియామాక పత్రాన్ని జారీ చేశారు.



కాళేశ్వరంలోని త్రివేణిసంగమ గోదావరి

పుణ్యస్నానాలకు
గోదావర్రీ

ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు శూన్యం
- వివిధ రాష్ట్రాల నుంచి పుణ్యస్నానాలకు భక్తజనం రాక
- కయ్యలు, గోతుల్లో లోతు తెలియక ప్రమాదాలు
- కనీసం సూచిక బోర్డులు ఏర్పాటు చేయని అధికారులు

కాళేశ్వరం: కాళేశ్వరంలో ఈనెల 25 నుంచి 27 వరకు మహా శివరాత్రి ఉత్సవాలు, మే 15నుంచి 26వరకు సరస్వతీ నది పుష్కరాలను ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వం, దేవాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉత్సవాలకు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. వేసవి సమీపిస్తుండడంతో గోదావరిలో నీరు తగ్గుముఖం పడుతుంది. గోదావరిలో అక్కడక్కడా ఇసుక తరలిపోయి కయ్యలు, గోతులు ఏర్పడ్డాయి. దీంతో భక్తులు పుణ్యస్నానాలకు దిగి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. దేవాదాయ, ఇరిగేషన్, పోలీసు, పంచాయతీ, రెవెన్యూశాఖలు సంయుక్తంగా రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. రక్షణ ఏర్పాట్లు అధికారయంత్రం చేపట్టడం లేదు.

ఎంతో మంది మృత్యువాత..
యువత, పెద్దలు, మహిళలు, చిన్నారులు గోదావరిలో దైవదర్శనానికి వచ్చి స్నానాలకు దిగి లోతు ప్రవాహంలో చిక్కుకుని మృత్యుఒడికి చేరిన ఘటనలు కోకొల్లలు ఉన్నాయి. కొంతమంది యువకులు ఈత వచ్చిన వారు కూడా గోతులు, కయ్యల్లో పడి మృతిచెందారు. ప్రమాదవశాత్తు ప్రమాదానికి గురై తమ తల్లుల కడుపుకోతను మిగిల్చారు. ఎంతో భవిష్యత్ ఉన్న యువత అర్ధాంతరంగా గోదారి పాలు కావడంతో తల్లిదండ్రుల రోదనలే మిగిలుతున్నాయి. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా అధికారులు ముందస్తుగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నిత్యం విధుల నిర్వహణ..
గోదావరి వద్ద ఉత్సవాల రోజుల్లో కాకుండా నిత్యం ప్రమాద హెచ్చరిక బోర్డులు, రక్షణ వలయాలు, గత ఈతగాళ్లు గోదావరిలో ప్రమాదాల నివారణకు విధులు నిర్వర్తించేలా ఏర్పాట్లు చేయాలి. సంబంధిత శాఖ తమ సిబ్బందిని ఏర్పాటు చేయాలి.

కాపాడుతున్న పోలీసులు..
ఆత్మహత్యకు పాల్పడేవారు సైతం కాళేశ్వరం త్రివేణి సంగమం గోదావరికి వచ్చి పురుగుల మందు, నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇంట్లో గొడవపడి వచ్చిన అలాంటి వారిని సైతం చాలామంది వృద్ధులను, మహిళలను స్థానికులు పోలీసులు కాపాడి తమ వారికి అప్పగించారు.

బ్యాక్ వాటర్‌తో పెన్సింగ్..
బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 100ఎఫ్ఆర్ లెవల్ వరకు నీటి ప్రవాహం పెరిగితే భక్తులు స్నానాలు చేసేందుకు ఫెన్సింగ్‌ను కాళేశ్వరం పుష్కరఘాటు పొడవునా నిర్మించారు. అప్పుడు భక్తులు పెన్సింగ్ ఇవుతల స్నానాలు చేసేవారు. కానీ ఇప్పుడు మేడిగడ్డ బరాజ్‌లో నీటిని నిల్వ చేయడం లేదు. దీంతో బ్యాక్ వాటర్ నిల్వ లేదు. దీంతో గోదావరిలో నీరు రోజురోజుకూ తగ్గుతుంది. స్నానాలకు వచ్చే భక్తులకు సైతం నీటిలో చాలా దూరం వరకు వెళ్లాల్సి వస్తుంది.

కిలోమీటరు మేర..
వీఐపీ ఘాటు నుంచి సాధారణ పుష్కర ఘాటు వరకు భక్తులు పుణ్యస్నానాలు చేస్తుంటారు. స్నానాలు చేసిన అనంతరం శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామివారి ఆలయంలో అభిషేకాలు, దర్శనాలు చేసుకుంటారు. మహాశివరాత్రి రోజున సుమారు లక్షకుపైగా భక్తులు పుణ్యస్థానాల చేసి దర్శనాలకు వెళుతుంటారు. సరస్వతీ పుష్కరాలకు 12 రోజుల పాటు రోజుకు 50వేల నుంచి లక్ష వరకు భక్తులు స్నానాలు చేస్తారని అధికారులు ఇప్పటికే అంచనా వేస్తున్నారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు స్నానాలు చేసే అవకాశాలు ఉన్నాయి. అధికార యంత్రాంగం ముందస్తుగా గోదావరి ప్రాంతంలో కిలోమీటర్ మేర రక్షణ వలయాలు, ఎరుపు రంగు జెండాలు ఏర్పాటు చేయాల్సిందిగా భక్తులు కోరుతున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, చెన్నూర్, గోదావరిఖని, మంథని, భూపాలపల్లి, పరకాల, నర్సంపేట, జనగామ, బెల్లంపల్లి, మందమర్రి, పెద్దపల్లి, కరీంనగర్, మంచిర్యాల, కాటారం, మహారాష్ట్ర వైపు సిరొంచ తదితర ప్రాంతాల యువకులు ఇక్కడ మృతిచెందిన ఘటనలు ఉన్నాయి. నిత్యం ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సూచిక బోర్డులు, ఎరుపు రంగు జెండాలు, గజ ఈతగాళ్లను జిల్లా అధికార యంత్రాంగం ముందస్తుగా ఏర్పాటు చేయాలి.

రక్షణ చర్యలు చేపడుతాం..
భక్తులు లోతు ప్రవాహంలోకి వెళ్లకుండా మహాశివరాత్రి, సరస్వతీ పుష్కరాల కోసం ముందస్తుగానే రక్షణ చర్యలు తీసుకుంటాం. సంబంధిత శాఖలతో సమన్వయంతో కలిసి పనిచేస్తాం. నిత్యం రక్షణ వలయాలు ఉండేలా ప్లాన్ చేస్తాం. ఉత్సవాలు జరిగినప్పుడే కాకుండా నిత్యం ఉండేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతాం.
- తిరుపతిరావు, ఈఈ, ఇరిగేషన్‌శాఖ, మహదేవపూర్

వసతి గృహాల్లో మెరుగైన వసతులు

కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి: వసతి గృహాల్లోని విద్యార్థులు బాగా చదువుకోవడానికి అవసరమైన వసతి, సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పన, మరమ్మతులు తదితర అంశాలపై ఐడీఓసీ కార్యాలయంలో శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, విద్యా, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, ప్రణాళిక, ఎస్సీ, బీసీ, మైనారిటీ, కేజీబీవీ, సాంఘిక సంక్షేమ, జ్యోతిబా పూలే సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనపై అధికారులు అందచేసిన ప్రతిపాదనల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరమ్మతులు, సౌకర్యాలు కల్పనపై అందచేసిన ప్రతిపాదనలకు సమగ్ర నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. వసతి గృహాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, మరమ్మతులు, ప్రహరీ నిర్మాణం, హైమస్ట్ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. అన్ని వసతి గృహాల్లో ఫుడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేశామని, కమిటీలు క్రమం తప్పక ఆహార నాణ్యతను పరిశీలించాలని పేర్కొన్నారు. మండల ప్రత్యేక అధికారులు, సంక్షేమ శాఖల అధికారులు క్రమం తప్పక వసతి గృహాల్లో మెనూ అమలును తనిఖీలు చేస్తూ విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులు వెలకట్టలేని సంపద అని వెల్లడించారు. విద్యార్థులకు తాజా ఆహారాన్ని పెట్టాలని సూచించారు. సౌకర్యాలు, మరమ్మతులు ప్రతిపాదనలు సీపీఓకు అందచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, విద్యా శాఖ అధికారి రాజేందర్, సీపీఓ బాబురావు, పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశ్వర్లు, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారులు శైలజ, సునీత, గిరిజన సంక్షేమ శాఖ అకడమిక్ మోనిటర్ రాజరత్నం పాల్గొన్నారు.

17న సదరం క్యాంపు

భూపాలపల్లి రూరల్: జిల్లాలో శారీరక, వినికిడి, మానసిక, కంటిచూపు వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఈనెల 17న జిల్లా కేంద్రంలోని 100 పడకల ఆస్పత్రిలో సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఓ నరేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల దివ్యాంగులతో పాటు రెన్యూవెల్ చేసుకునేవారు మీసేవలో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. స్లాట్ బుక్ చేసుకున్నవారే క్యాంపులకు హాజరు కావాలన్నారు.

సోలార్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం

- అలసత్వం వీడితేనే అభివృద్ధి
- సమస్యలు తెలుసుకునేందుకు కార్మిక చైతన్య యాత్ర
- సింగరేణి సీఎండీ బలరాం



భూపాలపల్లి ఏరియాలో మహిళా కార్మికులతో మాట్లాడుతున్న సీఎండీ బలరాంనాయక్

భూపాలపల్లి అర్బన్: సింగరేణి భవిష్యత్‌లో ఐదు వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని సంస్థ సీఎండీ బలరాంనాయక్ తెలిపారు. సింగరేణి కార్మిక చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణ, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లుతో కలిసి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 1, 5, 6, 8, ఓసీపీ–2, 3 గనులను సందర్శించారు. అంతకు ముందు కేటీకే 5వ గని ఏర్పాటుచేసి బలరామ నందనవనంను సీఎండీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. భూగర్భ గనులు నష్టాల బాటలో ఉన్నాయని, వాటిలో సౌకర్యాలు మెరుగుపర్చనున్నట్లు పేర్కొన్నారు. ఏరియాలో తాడిచర్ల, వెంకటాపూర్ బ్లాక్‌లను సింగరేణికి కేటాయించి బొగ్గు ఉత్పత్తి చేపట్టేలా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులు కృషి చేస్తున్నట్లు వివరించారు. సింగరేణి అధికారుల అలసత్వంతోనే సంస్థలో క్షేత్రస్థాయిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి రావడం లేదని.. అందులో భాగంగా కార్మిక చైతన్యం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు అందరూ తమకు కేటాయించిన విధులను తప్పనిసరిగా నిర్వర్తించాలన్నారు. భారీ యంత్రాల వినియోగ సమయాన్ని పెంచాలని సూచించారు. సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు తప్పనిసరిగా హాజరవుతూ నిర్దేశిత లక్ష్యాల సాధనకు కృషిచేయాలని ఆదేశించారు. గనులలో వివిధ కేటగిరీలలో పనిచేస్తున్న ఉద్యోగులతో చైర్మన్ మాట్లాడి వారికి కావలసిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అందరూ అలసత్వాన్ని వదిలి ఉత్సాహంగా పనిచేయాలన్నారు. ఆస్పత్రుల అడ్మినిస్ట్రేషన్‌కు మిలిటరీ డాక్టర్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. సంస్థలో మహిళా ఉద్యోగులు పెరుగుతున్న సందర్భంగా వారికి కావలసిన అన్ని ఏర్పాట్లను సంస్థ చేస్తుందని అన్నారు. సంస్థలో చేరిన మహిళలకు ఈపీ ఆపరేటర్లుగా వెళ్లడానికి అవకాశం ఉందని.. దానిని మహిళా కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి, కార్పొరేట్ జీఎంలు మనోహర్, రఘునాథరెడ్డి, ఎస్ఓటు జీఎం కవీంద్ర, అధికారులు వెంకటరామరెడ్డి, వెంకటరమణ, జాకీర్‌హుస్సేన్, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు కొరిమి రాజ్‌కుమార్, రాజేందర్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

డీసీసీ పీఠాలపై ఎవరు..?

జిల్లా కాంగ్రెస్ కమిటీలపై టీపీసీసీ కసరత్తు
- 'స్థానిక' ఎన్నికలే లక్ష్యంగా కొత్త కమిటీలు
- జిల్లా అధ్యక్షుల నియామకంపై అభిప్రాయ సేకరణ
- ఎమ్మెల్యేలు, సీనియర్‌లతో అధిష్టానం సంప్రదింపులు
- అవకాశం రాని సీనియర్‌లకు టీపీసీసీలో స్థానం
- నెలాఖరులో కొలిక్కి వచ్చే అవకాశం

సాక్షిప్రతినిధి, వరంగల్ :

జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)లపై కసరత్తు క్లైమాక్స్‌కు చేరుకుంటోంది. ప్రభుత్వ పథకాల ప్రచారంతోపాటు క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కమిటీలు ఉండాలని అధిష్టానం భావిస్తోంది. ఈ ఏడాదంతా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపాలిటీల పాలకవర్గం పదవీకాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. మరోవైపు ఎప్పుడు నోటిఫికేషన్ వెలువడినా ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. ఈ నేపథ్యంలో సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా డీసీసీల నియామకంపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దృష్టి సారించింది.

ఎమ్మెల్యేలు లేదంటే సీనియర్‌లు..
టీపీసీసీ, అధిష్టానం సంకేతాల మేరకు త్వరలోనే కాంగ్రెస్ పార్టీకి కొత్త జిల్లా అధ్యక్షులు రానున్నారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి, సమన్వయం చేయగలిగే వ్యక్తులను ఎంపిక చేయాలని ఆలోచిస్తున్న అధిష్టానం.. ఆర్థికంగా బలంగా ఉండే వాళ్లను తీసుకోవాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలను గానీ, సీనియర్‌లను గానీ ఈసారి నియమించే అవకాశం ఉందని పార్టీవర్గాలు చెబుతున్నాయి. హనుమకొండ జిల్లాలో ఇద్దరు, వరంగల్‌లో ముగ్గురు, మహబూబాబాద్‌లో ఇద్దరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు. జనగామలో ఇద్దరు, ములుగు, జేఎస్ భూపాలపల్లిలో ఒక్కరేసి ఉన్నారు.

- హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా మరోసారి కొనసాగాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని అధిష్టానం కోరుతున్నా ఆయన ససేమిరా అంటున్నట్లు తెలిసింది. పార్టీ సీనియర్, తనకు అనచరుడిగా ఉండే ఇద్దరు పేర్లు సూచిస్తున్నట్లు చెబుతున్నారు.
- వరంగల్ జిల్లా అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణనే కొనసాగించాలని కొందరు.. కొత్తవాళ్లకు అవకాశం ఇవ్వాలని మరికొందరు సూచించినట్లు సమాచారం. ఈ విషయంలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి నిర్ణయం ఫైనల్ కానుంది.
- మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా భరత్‌చందర్‌రెడ్డినే కొనసాగిస్తారన్న చర్చ ఉండగా.. డోర్నకల్, మహబూబాబాద్, ఎమ్మెల్యేలు రామచంద్రునాయక్, మురళీనాయక్‌లతోపాటు సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిల నిర్ణయం కీలకంగా కానుంది.
- జయశంకర్ భూపాలపల్లి అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నందున.. ఆయననే కొనసాగించాలా? మార్చాలా? అన్న విషయమై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో టీపీసీసీ చర్చించింది.
- ములుగు జిల్లా నుంచి మళ్లీ పైడాకుల అశోక్‌కే అవకాశం ఉన్నట్లు స్పష్టమవుతోంది.
- జనగామ జిల్లా అధ్యక్ష పదవికి పోటీ ఏర్పడుతోంది. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కొనసాగించలేని పరిస్థితి వస్తే ఎలా? అన్న చర్చపై ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అత్త, పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పేరును ఆ జిల్లా ఎమ్మెల్యేలు ప్రతిపాదించినట్లు ప్రచారం ఉంది.

అనివార్యంగా మారిన డీసీసీ అధ్యక్షుల నియామకం..



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజుల తర్వాత రేవంత్ రెడ్డి సిఫారసు మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ డీసీసీ కమిటీలను ప్రకటించారు. రెండు విడతల్లో ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలకు అధ్యక్షులను నియమించారు. మొదటి విడతలో నియమితులైన అధ్యక్షుల పదవీకాలం రెండేళ్లు దాటిపోగా.. రెండో విడత డీసీసీలకు రెండేళ్లు కావొస్తోంది. ఈ నేపథ్యంలో అధిష్టానానికి కొత్త కమిటీల ఏర్పాటు అనివార్యంగా మారింది. 2022, డిసెంబర్ 10న హనుమకొండ, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు డీసీసీ అధ్యక్షులుగా నాయిని రాజేందర్ రెడ్డి, నల్లెల కుమారస్వామి, జె.భరత్‌చందర్‌రెడ్డిలను నియమించారు. ఇది జరిగిన కొద్ది రోజులకే ములుగు జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి అనారోగ్యంతో మృతిచెందాడు. 2023, మే 16న కుమారస్వామి స్థానంలో పైడాకుల అశోక్‌ను ములుగు అధ్యక్షుడిగా.. వరంగల్‌కు మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, జయశంకర్ భూపాలపల్లికి ప్రకాశ్‌రెడ్డిలను నియమించారు. జనగామ జిల్లా అధ్యక్షుడి నియామకం అప్పటికీ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మధ్య వివాదంగా మారినా.. చివరకు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డినే నియమించారు. ఆ తరువాత ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొంది రేవంత్ రెడ్డి సీఎం కావడం, టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ నియమితులయ్యారు.

డీసీసీబీ, 'పాక్స్'ల పదవీకాలం పొడిగింపు

- మరో ఆరు నెలలు కొనసాగే అవకాశం
- ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షిప్రతినిధి, వరంగల్ : రాష్ట్రంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పాక్స్) పాలకవర్గాల పదవీకాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. మరో ఆరు నెలల పాటు పదవిలో కొనసాగే విధంగా శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గం గడువు శుక్రవారంతో ముగియగా.. అదే రోజున మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటికే పదవీకాలం ముగిసిన గ్రామ పంచాయతీలు, ఎంపీపీ, జిల్లా పరిషత్‌లకు ప్రత్యేకాధికారులను నియమించిన విషయం తెలిసిందే. సహకార సంఘాలకు కూడా ప్రత్యేక అధికారుల నియామకం ఇబ్బందికరం కాగా.. పాలకవర్గాల అభ్యర్థన మేరకు ప్రభుత్వం 'పాక్స్'ల పదవీకాలం ఆరు నెలలు పొడిగించినట్లు చెబుతున్నారు. ఈ ఉత్తర్వుల ద్వారా ఉమ్మడి వరంగల్‌లో 91 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు పాలకవర్గాలు మరో ఆరు నెలలు సేవలు అందించనున్నాయి. ఇదిలా ఉండగా.. సహకార సంఘాల పదవీ కాలం పొడిగించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, కొండా సురేఖలకు, జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రజా ప్రభుత్వంలో సహకార సంఘాలకు అందిస్తున్న సహాయ సహకారాలకు ధన్యవాదాలని, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ సంఘాల బలోపేతానికి రాబోయే రోజుల్లో మరింత కృషి చేస్తామని ఆయన తెలిపారు.



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకుంటున్న రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, డీసీసీబీ చైర్మన్లు

'పుల్వామా' అమరులకు నివాళి

పుల్వామా అమరులకు ఏబీవీపీ ఆధ్వర్యంలో మహదేవపూర్ మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. మహదేవపూర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వద్ద వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ తీశారు. ఏబీవీపీ మహదేవపూర్ నగర కార్యదర్శి పేట సాయి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సాయి కిరణ్, శ్రీరామ, సాయి మనోజ్, పవన్, సంపత్, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.
- కాళేశ్వరం



క్లుప్తంగా

రైల్వే బ్లాక్‌తో పలు రైళ్ల దారి మళ్లింపు

కాజీపేట రూరల్: కాజీపేట-విజయవాడ మధ్య జరుగుతున్న రైల్వే నాన్ ఇంటర్ లాకింగ్ సిస్టం వర్క్ బ్లాక్‌తో పలు రైళ్లను దారి మళ్లించి నడిపిస్తున్నట్లు శుక్రవారం రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట, వరంగల్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లను వయా విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్‌కు దారి మళ్లించి నడిపిస్తున్నట్లు తెలిపారు. రైళ్ల దారి మళ్లింపుతో కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్‌ల నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడనున్నారు.

దారి మళ్లించిన రైళ్లు ఇవే..

ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు షాలీమార్-హైదరాబాద్ (18045) డైలీ వెళ్లే షాలీమార్ ఎక్స్‌ప్రెస్, ముంబాయి-భువనేశ్వర్ (11019) డైలీ వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-ముంబాయి (11020) డైలీ వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు హైదరాబాద్-షాలీమార్ (18046) డైలీ వెళ్లే షాలీమార్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 19వ తేదీన షాలీమార్-సికింద్రాబాద్ (22849) వెళ్లే షాలీమార్ ఎక్స్‌ప్రెస్‌లను దారి మళ్లించి నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్ రీషెడ్యూల్

ఈ నెల 18, 19వ తేదీన ఆదిలాబాద్-తిరుపతి (17406) డైలీ వెళ్లే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను నిర్ణీత సమయం కన్నా 90 నిమిషాల తేడాతో రీషెడ్యూల్‌గా నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

'వందేభారత్' కోచ్‌ల తగ్గింపు

ఈ నెల 19వ తేదీ నుంచి కాజీపేట మీదుగా నాగపూర్ - సికింద్రాబాద్- నాగపూర్ (20101/201002) మధ్య ప్రవేశపెట్టిన నాగపూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కోచ్‌లను తగ్గించి నడిపిస్తున్నట్లు శుక్రవారం రైల్వే అధికారులు తెలిపారు. నాగపూర్-సికింద్రాబాద్ ప్రధాన నగరాల ప్రాధాన్యతను, ఈ ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసి ప్రారంభించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల నుంచి పెద్దగా ఆధారణ రాకపోవడంతో కోచ్‌ల తగ్గింపు నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతాల్లో గడిచిన 5 నెలల్లో ఆక్యుపెన్సీ రేటు కేవలం 33 శాతం మాత్రమే ఉండటడంతో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లోని 20 నుంచి 8 కోచ్‌లకు తగ్గించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ ఎక్స్‌ప్రెస్‌కు సిర్పూర్‌కాగజ్‌నగర్, మంచిర్యాల, పెద్దపల్లి స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించాలని ప్రయాణికుల డిమాండ్ ఉంది.

భక్తులపై తేనెటీగల దాడి

ఎస్ఎస్ తాడ్వాయి : ములుగు జిల్లా మేడారం జాతరకు శుక్రవారం వచ్చిన భక్తులపై తేనెటీగలు దాడి చేయగా సుమారు 15మందికి తీవ్రంగా గాయాలయ్యాయి. వారిని స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి తరలించగా వైద్యాధికారులు చికిత్స చేశారు. వైద్యశిబిరం సందర్శనకు వచ్చిన డీఎంహెచ్ఓ గోపాల్‌రావు చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. తేనెటీగల దాడిలో గాయపడినవారితో కలిసి శుక్రవారం 110 మందికి వైద్యసేవలు అందించినట్లు వైద్యాధికారులు వెల్లడించారు. మేడారం జాతరలో ఈగలు, దోమలు వ్యాపించకుండా మటన్, చికెన్ షాపులు ఏర్పాటు చేసిన యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్, జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను సందర్శించి వైద్యసేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చంద్రకాంత్, డాక్టర్ యమున, డీపీఎంఓ సంజీవరావు, దుర్గారావు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమ్మక్క సారలమ్మ ప్రతిరూపాలకు పూజలు చేస్తున్న రాముయాదవ్ కుటుంబ సభ్యులు



బంగారంతో మహిళా భక్తులు



సారలమ్మ గద్దె వద్ద భక్తుల మొక్కులు



'జంపన్న'లో స్నానం..అమ్మవార్ల దర్శనం

- వనదేవతలకు మొక్కులు సమర్పించిన భక్తులు
- మార్మోగిన గద్దెల ప్రాంగణం
- నేటితో మినీ జాతర ముగింపు





గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీ

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క సారలమ్మల గద్దెల ప్రాంగణం శుక్రవారం భక్తుల రద్దీతో కోలాహలంగా మారింది. అమ్మవార్లను దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు మేడారానికి తరలివచ్చారు. జంపన్నవాగు వద్ద స్నానాలు ఆచరించారు. అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీర, సారె, ఎత్తు బంగారం, పూలు, పండ్లు, ఒడి బియ్యం, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మేడారం పరిసరాలన్నీ భక్తుల రద్దీతో కనిపించాయి. మొక్కుల అనంతరం భక్తులు వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు చేసి తిరుగు ప్రయాణం అయ్యారు. కాగా నేటి (శనివారం)తో మేడారం మినీజాతర ముగియనుంది.

జాతరలో మెరుగ్గా పారిశుద్ధ్య పనులు..

మేడారం మినీజాతరలో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా సాగుతున్నాయి. జాతరకు వచ్చే భక్తులకు ఎక్కడా కూడా పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా కార్మికులు చెత్తా, చెదారాన్ని తొలగించి శుభ్రం చేస్తున్నారు. రోడ్ల వెంట దుమ్ము, దూళి లేవకుండా ట్యాంకర్లతో నీళ్లు చల్లుతున్నారు. డీపీఓ దేవరాజ్ పారిశుద్ధ్య పనులు నిరంతరం పర్యవేక్షిస్తూ చెత్త సేకరణపై కార్మికులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు.

భక్తులకు ఉచిత తాగునీరు

మేడారంలో భక్తులకు అక్కడక్కడ ఉచిత తాగు నీటి శిబిరాలను ఏర్పాటు చేశారు. ట్యాంకర్ల ద్వారా నీటిని శిబిరాలను తరలించి భక్తులకు అందిస్తున్నారు. జాతరకు వచ్చిన భక్తులకు ఉచిత తాగునీరు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎండతీవ్రత పెరగడంతో భక్తులకు ఉచిత తాగు నీటి శిబిరాలు దాహాన్ని తీరుస్తున్నాయి.



షవర్ల కింద స్నానాలు చేస్తున్న భక్తులు



పూజా మందిరంలో పొగలు..

ఎండోమెంట్ కార్యాలయంలో శాలాహారం ప్రహరీకి అనుకొని ఉన్న వనం పూజా మందిరంలో పొగలు వ్యాపించాయి. మందిరంలోని చెత్త చెదారానికి ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో అక్కడే ఉన్న దేవాదాయ శాఖ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది స్పందించి ఫైర్ ఇంజన్ ద్వారా మంటలను చల్లార్చారు. పూజా మందిరంలో ఒక్కసారి పొగ వ్యాపించడంతో ఎండోమెంట్ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది ఏం జరిగిందోనని ఆందోళన చెందారు.

ఎత్తు బంగారంతో అమ్మవారి ప్రతిరూపం

అమ్మవార్లకు మొక్కుగా సమర్పించే ఎత్తు బంగారంతో సమ్మక్క, సారలమ్మల ప్రతిరూపాలుగా అలంకరించిన హైదరాబాద్‌కు చెందిన రాముయాదవ్ కుటుంబ సభ్యుల తీరు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'తరతరాల నుంచి అమ్మవార్లను పూజిస్తున్నాం. ప్రతీ మహాజాతరకు కుటుంబ సభ్యులు, బంధువులు మొత్తం 500 మంది కలిసి మేడారానికి వస్తుంటాం. మినీజాతర సందర్భంగా జాతరకు వచ్చి అమ్మవార్లకు ప్రత్యేకంగా మొక్కులు చెల్లిస్తాం. అలాగే అమ్మవార్లకు మొక్కుగా 10 రకాల మద్యాన్ని ఆరగించి పూజలు చేశామని, యాటపోతుతో నైవేద్యం సమర్పించాం విడిది చేసే చోట బంగారంతో అమ్మవార్ల ప్రతిరూపాలను చేసి పూజలు, నైవేద్యం సమర్పించాకే గద్దెలకు వెళ్లి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ' అని వారు తెలిపారు.



బంగారంతో దర్శనానికి వెళ్తున్న భక్తులు



పూజామందిరంలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అందరి సహకారంతో విజయవంతం: కలెక్టర్ దివాకర

అన్ని శాఖల అధికారుల సమన్వయంతోనే మేడారం జాతర విజయవంతమైందని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. శుక్రవారం మేడారంలోని ఐటీడీఏ గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. మినీ జాతరకు వచ్చిన భక్తులతో మేడారం సందడి వాతావరణం సంతరించుకుందన్నారు. జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు కల్పించామన్నారు. ఈనెల 16న (ఆదివారం) సెలవు రోజు భక్తులు వేలాది తరలివస్తారనే అంచనాతో అప్పటి వరకు కావాల్సిన ఏర్పాట్లు కూడా చేశామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రత చర్యల కోసం పోలీసులు చర్యలు చేపట్టారన్నారు. జాతర కవరేజ్ చేసి సహకరించిన మీడియాకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా కలెక్టర్ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సాంప్రదాయంగా దేవాదాయ శాఖ అధికారులు, పూజారులు కలెక్టర్‌కు స్వాగతం పలికి దగ్గరుండి దర్శనం చేయించి అమ్మవార్ల ప్రసాదం అందించారు. కలెక్టర్ వెంట ఈఓ రాజేంద్రం, మంగపేట తహసీల్దార్ రవీందర్, డీటీ సురేష్‌బాబు, తదితరులు ఉన్నారు.



మొక్కులు చెల్లించుకుంటున్న కలెక్టర్ దివాకర



ఉచిత తాగు నీటి శిబిరం వద్ద..



క్యూలైన్‌లో దర్శనానికి వెళ్తున్న భక్తులు

కాంట్రాక్ట్ టీచర్లుగా 2008 డీఎస్సీ అభ్యర్థులు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 182మంది ఎస్‌జీటీలుగా ఎంపిక
- నేడు డీఈఓ కార్యాలయాల్లో నియామక పత్రాలు అందజేత



విద్యారణ్యపురి: 2008 డీఎస్సీలో క్వాలిఫై అయిన బీఈడీ అభ్యర్థులను అప్పట్లో ఎస్‌జీటీలుగా ఎంపిక చేయలేదు. దీంతో వారు కొన్నేళ్లుగా తమను టీచర్లుగా నియమించాలని కోరుతూ వస్తున్నారు. ఎట్టకేలకు సర్కారు కరుణ చూపింది. కాంట్రాక్ట్ టీచర్లుగా నియమించాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఉమ్మడి జిల్లాలో 182మంది అభ్యర్థులు ఉండగా, వీరికి శనివారం ఆయా జిల్లాకేంద్రాల్లోని డీఈఓ కార్యాలయాల్లో నియామకపత్రాలు అందించనున్నారు.

ఇటీవల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

2008 డీఎస్సీ క్వాలిఫై అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఇటీవల హనుమకొండ డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 295మంది అభ్యర్థులకుగాను 182మంది సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకున్నారు. ఎంపికైన వారు శనివారం తమ ఒరిజనల్ విద్యార్హతల సర్టిఫికెట్లతో కేటాయించిన జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి వెళ్లాలి. సర్టిఫికెట్లను మరోసారి పరిశీలించి డీఈఓల చేతుల మీదుగా కాంట్రాక్ట్ ఎస్‌జీటీగా నియామక పత్రాలు అందించనున్నారు.

జిల్లాల వారీగా అభ్యర్థులు ఇలా..

వరంగల్	08
హనుమకొండ	18
జేఎస్ భూపాలపల్లి	43
ములుగు	28
మహబూబాబాద్	52
జనగామ	33

నెలకు రూ.31,040 వేతనం

కాంట్రాక్ట్ టీచర్లుగా నియమితులైనవారికి నెలకు రూ.31,040 వేతనం ఇవ్వనున్నారు. నియమ నిబంధనల ప్రకారం రూ.100 బాండ్ పేపర్ సమర్పించాలి. ఆ తరువాత కేటాయించిన పాఠశాలలో విధులకు హాజరుకావాల్సి ఉంటుంది.

కేయూలో టాప్ సైంటిస్టులు వీరే..

కేయూ క్యాంపస్: ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది యూనివర్సిటీలు, శాస్త్రవేత్తలకు ర్యాంకింగ్స్ ఇచ్చే అమెరికాకు చెందిన ఏడీ సైంటిఫిక్ ఇండెక్స్(అల్పర్ డోగల్) ఈ ఏడాది జాబితాను విడుదల చేసింది. పరిశోధనా పత్రాల హెచ్ ఇండెక్స్ ఐ 10 ఇండెక్స్ సైటేషన్స్ ఆధారంగా ఈ ర్యాంకింగ్‌ను ఖరారు చేశారు. కాకతీయ యూనివర్సిటీలో టాప్ ఐ సైంటిస్టుల జాబితాను కూడా సంబంధిత వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఏడీ సైంటిఫిక్ ఇండెక్స్ ప్రపంచ, జాతీయ, ప్రాంతీయ విషయాల్లో 13 ప్రధాన రంగాలు, 197 ఉప శాఖల్లో అత్యంత సమగ్రమైన విశ్లేషణను అందిస్తుంది. ఈ విశ్లేషణలు గత 6 సంవత్సరాల నుంచి వాటి విలువలతో సహా హెచ్ ఇండెక్స్ ఐ 10 ఇండెక్స్, సైటేషన్ కౌంట్ వంటి సూచికలపై ఆధారపడి ఉంటాయి. 2025 ఈనెల 14 నాటికి ర్యాంకింగ్‌లు మొత్తం హెచ్ ఇండెక్స్ ప్రకారం నిర్ణయించబడి సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ప్రపంచంలో 221 దేశాల్లో 24,503 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న సైంటిస్టుల పరిశోధనలు ఈ సంస్థ పరిశీలన చేయగా అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీ మొదటి స్థానాన్ని దక్కించుకుంది. కేయూ 960 స్థానంలో నిలిచింది.

కేయూ సైంటిస్టులు..

యూనివర్సిటీ స్థాయిలో టాప్ 5 సైంటిస్టులుగా కేయూకు చెందిన ఐదుగురు ప్రొఫెసర్లకు స్థానం లభించింది. కేయూ ఫార్మసీ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ రఘురామారావు మొదటిస్థానం, అదే కళాశాలకు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ సిద్ది వీరేశం రెండోస్థానం, బయోటెక్నాలజీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు సదానందం మూడో స్థానం, జువాలజీ విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి నాల్గో స్థానం, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రసాద్ ఐదో స్థానంలో నిలిచారు. జువాలజీ విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి పరిశోధనలపరంగా నాలుగు పేటెంట్లు కలిగి ఉండగా.. ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ ప్రసాద్ పలు పేటెంట్లు పొందారు.



రిటైర్డ్ ప్రొఫెసర్ రఘురామారావు | రిటైర్డ్ ప్రొఫెసర్ సిద్దివీరేశం | రిటైర్డ్ ప్రొఫెసర్ సదానందం | ప్రొఫెసర్ ఇస్తారి | ప్రిన్సిపాల్ ప్రసాద్

31 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ మహేందర్‌రెడ్డి

పాలకుర్తి టౌన్: గంజాయిని తరలిస్తున్న అంతరాష్ట్ర ముఠా నిందితులు ఇద్దరిని శుక్రవారం పాలకుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7.92 లక్షల విలువ చేసే 16 ప్యాకెట్లలోని 31 కిలో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి వెల్లడించారు. ముంబైకి చెందిన అశిష్ రామ్‌నాయక్ యాదవ్, రాహుల్ రామ్ లఖన్‌తివారి అదే ప్రాంతంలోని మోతీ టెక్ కంపెనీలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. ఈజీ మనీ కోసం గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. వారితో కలిసి ఉద్యోగం చేసే అన్ను గంజాయి సరఫరా చేస్తున్నారని తెలుసుకొని ఒడిశాలోని భువనేశ్వర్‌లో కలిశారు. అన్నుతో మాట్లాడి అతని వద్ద రూ.1.80 లక్షలకు 31 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. భువనేశ్వర్ నుంచి తిరిగి ముంబైకి రైలులో వెళ్తున్న క్రమంలో వరంగల్ రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీ చేస్తుండగా భయంతో నిందితులు రైలు దిగి బస్టాండ్ వైపు వెళ్లారు. హైదరాబాద్‌కు వెళ్లే క్రమంలో వరంగల్‌లో బస్సు ఎక్కి పాలకుర్తి ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. పోలీసులను చూసి పారిపోయే క్రమంలో పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న సీఐ మహేదర్‌రెడ్డి, ఎస్సై పవన్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ సోమిరెడ్డి, సిబ్బంది రాజ్‌కుమార్, సురేష్, రమేష్, రవి, సూర్యప్రకాశ్, యాకయ్యను జనగామ వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ అభినందించారు.



వరంగల్‌లో గంజాయితో పట్టుపడిన దంపతులు

వరంగల్‌లో 24కిలోలు..

ఖిలా వరంగల్: రైలులో గంజాయి తరలిస్తున్న దంపతులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.6 లక్షల విలువైన 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు శుక్రవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో సంబంధిత అధికారులు నిఘా పెట్టారు. ఈక్రమంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన దంపతులు గోగి శంకర్‌దాస్- గోగి పూర్ణిమదాస్‌లు ఒడిషాలో ప్రదీప్ అనే గంజాయి స్మగ్లర్ వద్ద 24 కిలోల గంజాయి కొనుగోలు చేసి ముంబై-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయల్దేరారు. శుక్రవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో రైలు దిగి బయటకు వెళ్లేందుకు యత్నిస్తుండగా.. డగ్స్ కంట్రోల్ టీం, మిల్స్‌కాలనీ ఎస్సై సురేశ్ వారి బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి లభించింది. వారిని అరెస్టు ఎండు గంజాయి, 2సెల్‌ఫోన్లు స్వాధీన పర్చుకుని మిల్స్‌కాలనీ స్టేషన్‌కు తరలించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. ములుగు జిల్లాలో ముగ్గురు, మానుకోట జిల్లాలో ఒకరు చనిపోయారు.


డోర్నకల్: ఖమ్మం జిల్లా ముదిగొండ సమీపంలో కోదాడ హైవేపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మానుకోట జిల్లా డోర్నకల్ మండలం రాముతండావాసి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. తండాకు చెందిన నునావత్ వీరన్న (30) ఖమ్మంలోని ఓ గ్రానైట్ పాలీష్ రాళ్ల కంపెనీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం లారీలో గ్రానైట్ పాలీష్ రాళ్లను తీసుకుని వీరన్నతో పాటు మరికొంతమంది కూలీలు కోదాడవైపు వెళ్తుండగా ముదిగొండ సమీపంలో లారీ వెనక టైర్లు ఊడి బోల్తా పడింది. దీంతో వీరన్నతో పాటు మరో వ్యక్తి మృతి చెందగా మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరన్నకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ట్రాక్టర్ నుంచి జారి పడి వ్యక్తి ..

ములుగు రూరల్: మేడారం మినీ జాతరకు వెళ్లి తిరిగి వస్తుండగా ట్రాక్టర్‌పై నుంచి జారిపడి మృతి చెందిన ఘటన రెడ్డిగూడెం సమీపంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ములుగు మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన డేగల సారయ్య కుటుంబ సభ్యులతో కలిసి ట్రాక్టర్‌పై మేడారం జాతరకు వెళ్లాడు. అమ్మవార్లకు మొక్కులు చెల్లించి తిరిగి వస్తున్న క్రమంలో ట్రాక్టర్‌పై నుంచి జారిపడగా 108 అంబులెన్స్ సాయంతో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు.. సారయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. సారయ్య మృతి విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కూతురును చూసివస్తూ అనంత లోకాలకు..

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడేనికి చెందిన మరగోని రాజబాబు (40) బైక్ అదుపుతప్పి కింద పడడంతో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బుట్టాయిగూడేనికి చెందిన రాజబాబు తాడ్వాయిలోని హాస్టల్‌లో ఉంటున్న కుమార్తెను చూసేందుకు శుక్రవారం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మండలంలోని కంతనపల్లి వద్ద ప్రమాదవశాత్తు తను ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో రాజబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఏటూరునాగారం ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. రాజబాబుకు భార్య రాణి, ఇద్దరు కుమార్తెలు పూజ, శ్రీజ, కుమారుడు బన్నీ ఉన్నారు. మృతుడి అన్న రమేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రాజబాబు(ఫైల్)

ట్రాక్టర్ పైనుంచి పడి వలస కూలి మృతి

ఏటూరునాగారం: కన్నాయిగూడెం మండలం ఐలాపురంలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లి వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న వలస కూలీ మడకం దేవో (55) అనే మహిళా మృతి చెందినట్లు ఏఎస్ఐ సుబ్బారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బైరాంగాడ్‌తాలుక బట్వాడ గ్రామానికి చెందిన దేవోతోపాటు మరికొందరుతో కలిసి 20 రోజుల క్రితం మండలంలోని చెల్పాక గ్రామానికి మిరప కోత పనుల నిమిత్తం వచ్చారు. గురువారం సాయంత్రం అందరూ కలిసి ఐలాపురం జాతరకు వెళ్లి రాత్రి దర్శనం చేసుకున్న అనంతరం శుక్రవారం తెల్లవారు జామున తిరిగి వస్తుండగా దొడ్ల కొత్తూరు గ్రామం దాటిన తర్వాత ట్రాక్టర్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు కాగా మిగతా వారికి స్వల్పంగా అలాయి.. దేవోను ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై తెలిపారు.



దేవో మృతదేహం

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి

- ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

వరంగల్ చౌరస్తా: ఆర్యవైశ్యుల అభివృద్ధికి ఐక్యమత్యంతో కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరావది లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం వరంగల్, హనుమకొండ జిల్లాల ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల సమావేశం వరంగల్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న తెలంగాణ మహాసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని, అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాబోయే కాలంలో ఆర్యవైశ్యుల విద్య, వైద్య సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో భారీ భవనాలను నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రేణుకుంట్ల గణేష్ గుప్తా, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఆగిరి వెంకటేష్, రాష్ట్ర నాయకులు గార్లపాటి శ్రీనివాస్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తోట సురేష్, ప్రతినిధులు తల్లాడ వెంకటరామయ్య, రమేష్, పవిత్ర శ్రీనివాస్, దొడ్డమోహన్ రావు, శ్రీనివాస్, శ్రీ రామ్ రవీందర్, కిషోర్, దాచేపల్లి సీతారాం, ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ